
సాక్షి ఒడిశా

సోమవారం । 6 । మార్చి । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్‌: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,78,043లు, బంగారం 1.24 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



వరపుత్రునికి నివాళులు

- ఘనంగా బిజూ పట్నాయక్‌ జయంతి కార్యక్రమాలు

- 8లో



కొనసాగుతున్న బోడా జాతర

- 8లో

న్యూస్‌రీల్‌

పంచాయతీలకు ఉత్తమ అవార్డులు



సదస్సులో పాల్గొన్న జెడ్పీ అధ్యక్షుడు తిరుపతిరావు, కలెక్టర్‌

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా కేంద్రం సమావేశ మందిరంలో పంచాయతీరాజ్‌, లోక్‌సేవా దినోత్సవం ఆదివారం నిర్వహించారు. జిల్లా పరిషత్‌ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, జిల్లా స్వతంత్ర అభివృద్ధి పరిషత్‌ అధ్యక్షుడు మరియం రైతో, కలెక్టర్‌ లింగరాజ్‌ పండా, సీడీఎం రామాంచల్‌ ఖమారీ, అదనపు ఎస్పీ వామదేవ్‌ సింగ్‌ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉత్తమ కేంద్రాలుగా అభివృద్ధి సాధించిన కాశీనగర్‌ బ్లాక్‌ గైబ పంచాయతీకి రూ.3 లక్షలు, నువాగడ బ్లాక్‌ ఖోజురిపద పంచాయతీకి రూ.2 లక్షలు, రాయగడ బ్లాక్‌కు రూ.లక్ష ప్రోత్సాక పురస్కారాలను అందజేశారు.

ఒడిశా యూనివర్సిటీ ఆఫ్‌ హెల్త్‌ సైన్సెస్‌ ఏర్పాటు

భువనేశ్వర్‌: రాష్ట్ర పంచాయతీరాజ్‌, లోకసేవా దివస్‌ పురస్కరించుకుని ముఖ్యమంత్రి నవీన్‌ పట్నాయక్‌ ఒడిశా యూనివర్సిటీ ఆఫ్‌ హెల్త్‌ సైన్సెస్‌(ఓయూహెచ్‌ఎస్‌) ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. భువనేశ్వర్‌ ప్రధాన కేంద్రంగా ఈ విశ్వవిద్యాలయం పని చేస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అల్లోపతి, హోమియోపతి, ఆయుర్వేదం, నర్సింగ్‌, ఫార్మసీ, పారా మెడికల్‌ సైన్సెస్‌ తదితర యూజీ, పీజీ కోర్సులలో ఏకరీతి, నాణ్యమైన వైద్య విద్యా బోధనకు ఈ సంస్థ దోహదపడుతుంది. ఈ సందర్భంగా సీఎం నవీన్‌ పట్నాయక్‌ మాట్లాడుతూ 'ఒడిశా ఆరోగ్య విద్యా విధానంలో ఇదో కొత్త మైలురాయి. వైద్య, అనుబంధ కళాశాలలు ఒడిశా యూనివర్సిటీ ఆఫ్‌ హెల్త్‌ సైన్సెస్‌ పరిధిలోకి వస్తాయి. రాష్ట్రంలో వైద్య విద్యా వ్యవస్థను క్రమబద్ధీకరించడం ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటు లక్ష్యం'గా పేర్కొన్నారు. రాష్ట్రంలో రోగుల సంరక్షణ, చికిత్స, వైద్య రంగాల్లో పరిశోధన కూడా ఊపందుకుంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

బెంగాలీ శరణార్థులకు మావోయిస్టుల హెచ్చరిక



రాయిఘర్‌లో మావోయిస్టులు వదలిన లేఖలు

కొరాపుట్‌: ఆదివాసీ భూములు జోలికి వస్తే తీవ్ర పరిణామాలు తప్పవని బెంగాలీ శరణార్థులకు మావోయిస్టులు హెచ్చరించారు. ఈ మేరకు నవరంగ్‌పూర్‌ జిల్లా రాయిఘర్‌ సమితి టిమన్‌పూర్‌ గ్రామం వద్ద మావోయిస్టులు ఆదివారం కరపత్రాలు వెదజల్లారు. రాయిఘర్‌ సమితిలో గతంలో కేంద్రప్రభుత్వం బెంగాలీ శరణార్థులకు భూములు ఇచ్చిందని గుర్తుచేశారు. కానీ ఇటీవల ఈ ప్రాంతంలో కొన్ని గ్రామాల్లో ఆదివాసి భూములను బెంగాలీలు ఆక్రమించుకున్నారని విమర్శించారు. తక్షణమే ఆ భూములు వదలి పెట్టాలని హెచ్చరించారు. లేకపోతే జరిగే పరిమాణాలకు వారే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని లేఖలో పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాదయాత్ర



కొరాపుట్‌ మీదుగా పాదయాత్ర చేస్తున్న కృష్ణ నాయక్‌

కొరాపుట్‌: పర్యావరణ పరిరక్షణ కోసం కర్ణాటక వాసి చేస్తున్న పాదయాత్ర కొరాపుట్‌ పట్టణానికి ఆదివారం చేరుకుంది. కర్ణాటక రాష్ట్రం మైసూర్‌ పట్టణానికి చెందిన కృష్ణ నాయక్‌ తన పాదయాత్రతో కొరాపుట్‌ చేరుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలో బాలలకు యోగా శిక్షణ అందించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సమాజంలో పర్యావరణ పరిరక్షణ, యోగాపై అవగాహన, మొక్కల పెంపకం లక్ష్యంగా యాత్ర చేస్తున్నట్లు పేర్కొన్నారు. గతేడాది ఆగస్ట్‌ 16న తన యాత్ర ప్రారంభించానని, ఇప్పటికే కర్ణాటక, తమిళనాడు, కేరళ, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రాల్లో 4వేల కిలోమీటర్లు పాదయాత్ర పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఇంకా 21 రాష్ట్రాల్లో 15వేల కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. తాను బీఎస్సీ విద్యతో పాటు అంతర్జాతీయ యోగా శిక్షకుడిగా గుర్తింపు పొందానన్నారు. సగటు భారతీయుడిగా ఇది తన సామాజిక బాధ్యతగా వివరించారు. అనంతరం ఆయన రాయగడ మీదుగా పూరీ వైపు పయనమయ్యారు.



జెండా ఊపి భువనేశ్వర్‌-రంగైలుండా విమాన సేవలు ప్రారంభిస్తున్న సీఎం నవీన్‌ పట్నాయక్‌

- నెరవేరిన గంజాం జిల్లావాసుల చిరకాల డిమాండ్‌
- భువనేశ్వర్‌-రంగైలుండా మధ్య విమానయాన సేవలు
- జెండా ఊపి ప్రారంభించిన సీఎం నవీన్‌ పట్నాయక్‌
- 10జిల్లాల ప్రజలకు ప్రయోజనకరం

విమానయానానందకరం



రంగైలుండా విమానాశ్రయాన్ని ప్రారంభిస్తున్న కార్మికమంత్రి శ్రీకాంత్‌ సాహు




విమాన ప్రయాన టికెట్‌ చూపిస్తున్న మేయర్‌ సంఘమిత్ర దొళాయి

భువనేశ్వర్‌: రాష్ట్ర రాజధాని నుంచి ఇతర నగరాలు, పెద్ద ప్రాంతాలను అనుసంధానించేందుకు రాష్ట్రప్రభుత్వం భువనేశ్వర్‌-రంగైలుండా(బరంపురం) మార్గంలో ప్రత్యక్ష విమానయాన సేవలను ప్రారంభించింది. ఈ మేరకు తొలి సర్వీసును ముఖ్యమంత్రి నవీన్‌ పట్నాయక్‌ ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక బిజూ పట్నాయక్‌ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఉదయం 9.33 గంటలకు బయలుదేరిన ఈ విమానం.. 10.40 గంటలకు రంగైలుండా చేరుకుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ వన్‌ఎయిర్‌ సంస్థ ఆధ్వర్యంలో ఈ సర్వీసు బరంపురాన్ని భువనేశ్వర్‌తో అనుసంధాన పరుస్తుందని తెలిపారు. చిలికా సరస్సు, తంపర సరస్సు, గోపాల్‌పూర్‌ బీచ్‌, రుషికుల్యా, తారాతారిణి దేవాలయం వంటి ఆకర్షణీయమైన ప్రదేశాలతో రంగైలుండా వద్ద వాయుమార్గ అనుసంధానం జిల్లాకు పర్యాటకులను ఆకర్షించడంలో సహాయపడుతుందన్నారు. సీనియర్‌ వైద్యులు, ఎంకేసీజీ మెడికల్‌ కళాశాల, ఆస్పత్రి అధ్యాపకులు, ఐజర్‌, ఇండియన్‌ రేర్‌ ఎర్త్‌ లిమిటెడ్‌, బరంపురం విశ్వవిద్యాలయం అధికారులు, నగరంలోని వ్యాపారవేత్తలు ఇతర వర్గాలు తరచూ సుదూర ప్రాంతాలకు వెళ్లి, వచ్చేందుకు సైతం ఈ సదుపాయం దోహద పడుతుందని పేర్కొన్నారు. దీంతో గంజాం జిల్లా ప్రజల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడిందని ప్రకటించారు. రాష్ట్ర ప్రాయోజిత విమానయానం కార్యకలాపాలు బరంపురం శివారు రంగైలుండా విమానాశ్రయంలో ప్రారంభం కావడం ఆనంకరమన్నారు. రంగైలుండా-భువనేశ్వర్‌ మధ్య నేరుగా విమానయానంతో గంజాం జిల్లాలో వాణిజ్యం, సంస్కృతి, పర్యాటక కార్యకలాపాలను అభివృద్ధి పరుస్తుందని వివరించారు.

300 ఎకరాల స్థలం గుర్తింపు..

బరంపురం: సీఎం నవీన్‌ పట్నాయక్‌ ప్రాతినిధ్యం వహిస్తున్న గంజాం జిల్లా నుంచి విమాన సేవలు అందుబాటులోకి రావడంతో బరంపురం పరిసర ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనికి అనుగుణంగా రంగైలుండా విమానాశ్రయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర కార్మికశాఖ మంత్రి శ్రీకాంత్‌ సాహు పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి నవీన్‌ పట్నాయక్‌ రాష్ట్రాన్ని వివిధ రంగాల్లో అభివృద్ధి చేసేందుకు దృష్టి సారించారన్నారు. రంగైలుండా విమానాశ్రయం ప్రారంభంతో దక్షిణ ఒడిశాలో వ్యాపార కేంద్రంగా ఉన్న బరంపురం నగరం మరింత అభివృద్ధి పడేందుకు దోహద పడుతుందని తెలిపారు. దాదాపు 10జిల్లాల ప్రజలకు ఈ సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. నగరానికి 5 కిలోమీటర్ల సమీపంలో ఉన్న ఈ విమానాశ్రయాన్ని బ్రిటిష్‌ ప్రభుత్వం ఎయిర్‌స్ట్రిప్‌గా ఉపయోగిచేందని, పూర్తిస్థాయి విమానాశ్రయం మార్చడం ఆనందకరమన్నారు. అలాగే పూర్తిస్థాయిలో అభివృద్ధి పరిచేందుకు 300 ఎకరాల స్థలాన్ని కేటాయించామని, త్వరలో ఈ పనులు పూర్తిచేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో దక్షిణాంచల్‌ ఆర్‌డీసీ టి.అహోంగా అహో, కలెక్టర్‌ దివ్యజ్యోతి పరిఢా, బరంపురం ఎంపీ చంద్రశేఖర్‌ సాహు, ఎమ్మెల్యే విక్రమ్‌కుమార్‌ పండా, మేయర్‌ సంఘమిత్ర దొళాయి తదితరులు పాల్గొన్నారు.



బరంపురం: సత్య మహరాణా రూపొందిన బిజూ పట్నాయక్‌ సైకతశిల్పం

ప్రదర్శనశాలగా.. డకోటా

- భువనేశ్వర్‌ ఎయిర్‌పోర్టులో ప్రారంభించిన ముఖ్యంత్రి నవీన్‌
- బిజూ పట్నాయక్‌కు ప్రియమైన విమానంగా ప్రసిద్ధి



బిజూ పట్నాయక్‌ అంతర్జాతీయ విమానాశ్రయం ఆవరణలో డకోటా విమానం



డకోటా ప్రదర్శనశాలను ప్రారంభిస్తున్న సీఎం నవీన్‌ పట్నాయక్‌

భువనేశ్వర్‌: స్థానిక నగరంలోని బిజూ పట్నాయక్‌ అంతర్జాతీయ విమానాశ్రయం ఆవరణలో డకోటా విమానాన్ని ప్రజా ప్రదర్శనకు ముఖ్యమంత్రి నవీన్‌ పట్నాయక్‌ ఆదివారం ప్రారంభించారు. దివంగత ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్‌ 107వ జయంతి సందర్భంగా విమానాశ్రయం ఆవరణలో దీనిని ఏర్పాటు చేశారు. బిజూ అత్యంత మక్కువ కనబరిచిన డకోటా విమానం ప్రజలు తిలకించేందుకు బహిరంగంగా ప్రదర్శించినట్లు సీఎం నవీన్‌ ప్రకటించారు. ఈ బహిరంగ ప్రదర్శన బిజూ బాబు ధైర్యసాహసాలు, సాహసోపేతానికి ప్రతిరూపంగా నిలిచి రాష్ట్ర ప్రజలు ఘనమైన కలలు కనేలా ప్రేరేపిస్తుందని అభిప్రాయం వ్యక్తంచేశారు. రెండో ప్రపంచ యుద్ధానికి ముందు స్వాతంత్ర్య సమరం, కశ్మీర్‌లో చొరబాట్లలో అలుపెరగని ధైర్య సాహసాలతో ఎదిరించడంలో ఆయన డకోటా విమానం ప్రత్యక్షంగా వినియోగించారని గుర్తుచేశారు. బిజూ పట్నాయక్‌, నైపుణ్యం కలిగిన పైలట్‌ అని, 1947లో ఇండోనేషియా ఉపాధ్యక్షుడు మహ్మద్‌ హత్తా, ప్రధానమంత్రి సుతాన్‌ షహ్రీర్‌లను వారి దేశం నుంచి రక్షించడానికి ఇదే విమానాన్ని ఉపయోగించారని తెలిపారు. ఈ సాహసాన్ని మెచ్చి, ఇండోనేషియా ప్రభుత్వం బిజూ పట్నాయక్‌ను ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం భూమి పుత్రతో రెండుసార్లు సత్కరించిందని వివరించారు.

1.1 ఎకరాల్లో..

రాజకీయాల్లోకి రాకముందు, బిజూ పట్నాయక్‌ కోల్‌కతా ప్రధాన కార్యాలయంగా 15 డకోటా విమానాల సముదాయంతో కళింగ ఎయిర్‌లైన్స్‌ ప్రారంభించారు. జవాన్ల రవాణా, సామగ్రి ఎయిర్‌ డ్రాపింగ్‌ తదితర భారతసేన సేవలకు ఈ ఎయిర్‌లైన్స్‌ వినియోగించడం విశేషం. ఈ చారిత్రాత్మక విమానం వర్తమాన తరాలు ప్రత్యక్షంగా సందర్శించేందుకు వీలుగా ఈ ప్రదర్శనశాల చేశారు. కోల్‌కతా లోని నేతాజీ సుభాష్‌ చంద్రబోస్‌ అంతర్జాతీయ విమానాశ్రయంలో మరుగున పడి ఉన్న డకోటాను అత్యంత జాగ్రత్తగా ఈ ఏడాది జనవరి 18న భువనేశ్వర్‌ తరలించారు. ఏరోస్పేస్‌ రీసెర్చ్‌ డెవలప్‌మెంట్‌కు చెందిన 10మంది సభ్యుల బృందం 12రోజులపాటు నిర్విరామంగా శ్రమించి, విమానం చిన్న చిన్న భాగాలుగా విడదీసి సురక్షితంగా తరలించారు. ఎయిర్‌పోర్ట్‌ అథారిటీ ఆఫ్‌ ఇండియా(ఏఏఐ) డీసీ-3 ఎయిర్‌క్రాఫ్ట్‌ విమానాశ్రయం ముందు ప్రదర్శనకు కోసం 1.1 ఎకరాల స్థలాన్ని కేటాయించింది.

'బార్‌' ఎన్నికలకు నామినేషన్లు



కొరాపుట్‌: అధ్యక్ష పదవికి నామినేషన్‌ అందిస్తున్న నర్సింగనాథ్‌ త్రిపాఠి



బరంపురం: నామినేషన్‌ పత్రాలు అందిస్తున్న కపిల్‌ పట్నాయక్‌, మద్దతుదారులు

కొరాపుట్‌: నవరంగ్‌పూర్‌ జిల్లా కోర్టులో న్యాయవాదుల సంఘం(బార్‌ అసోసియేషన్‌) ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ఆదివారం ప్రారంభించారు. సంఘం మాజీ అధ్యక్షుడు నర్సింగనాథ్‌ త్రిపాఠి, శ్యాంప్రసాద్‌ గంతాయత్‌ అధ్యక్ష పదవికి, ఉపాధ్యక్షుడిగా హరి బెహరా నామినేషన్లు సమర్పించారు. సోమవారం సాయంత్రం వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగనుంది. 10న పరిశీలన, 12న ఉప సంహరణ, 25న పోలింగ్‌ నిర్వహించడంతో పాటు అదే రోజు ఓట్ల లెక్కింపు జరగనుంది. మొత్తం 196మంది న్యాయవాదులు ఓటర్లుగా గుర్తింపు పొందారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి, 4 కార్యనిర్వాహక పదవులకు గాను ఎన్నికలు నిర్వహించనుండగా, రిటర్నింగ్‌ అధికారిగా సీనియర్‌ న్యాయవాది సీహెచ్‌ బాబా యుగంధర్‌(మురళీ), అదనపు ఎన్నికల అధికారులుగా కిషోర్‌ పట్నాయక్‌, ఇమ్రాన్‌ షరీఫ్‌ వ్యవహరిస్తున్నారు.

9మంది నామినేషన్లు

బరంపురం: ఈనెల మార్చి 25న గంజాం బార్‌ న్యాయవాదుల సంఘం ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలోని సంఘం కార్యాలయంలో ఎన్నికల నామినేషన్‌ ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికల అధికారి సీనియర్‌ న్యాయవాది అక్షయ్‌ పట్నాయక్‌ సమక్షంలో అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, సహాయ కార్యదర్శి పదవులకు పోటీ పడుతున్న 9మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఈనెల 8వరకు నామినేషన్ల స్వీకరణ, 11న పరిశీలన, 13న ఉప సంహరణ, 15న అభ్యర్థుల తుది జాబితా ప్రకటించనున్నారు. 25న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు పోలింగ్‌ జరగనుంది. ఇదే విధంగా ఒడిశా స్టేట్‌ బార్‌ కౌన్సిల్‌కు సంజీత్‌కుమార్‌ పాణిగ్రాహి నామినేషన్‌ పత్రాలు అందజేశారు.

పీడీఎస్‌ బియ్యంతో ప్రజారోగ్యానికి హాని

- మాజీ సీఎం గిరిధర్‌ గమాంగ్‌



దప్పు వాయిస్తున్న మాజీ సీఎం గిరిధర్‌ గమాంగ్‌



విలేకర్లతో మాట్లాడుతున్న గిరిధర్‌ గమాంగ్‌

జయపురం: కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో బీజేడీ ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్యానికి హానికరమైన పబ్లిక్‌ డిస్ట్రిబ్యూషన్‌(పీడీఎస్‌) బియ్యాన్ని పంపిణీ చేస్తూ జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని ఉల్లంఘిస్తున్నాయని భారత్‌ రాష్ట్రీయ సమితి నాయకులు, మాజీ ముఖ్యమంత్రి గిరిధర్‌ గమాంగ్‌ ఆరోపించారు. పట్టణంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు విటమిన్లు లేని పోర్టిఫైడ్‌ బియ్యాన్ని సరఫరా చేయడంతో వారంతా ఇతర అనారోగ్యాల బారిన పడుతున్నారని విమర్శించారు. బియ్యంలో విటమిన్లు, ఐరన్‌, ఫోలిక్‌యాసిడ్‌ అవసరం ఉన్నా పీడీఎస్‌లో అవి ఉండటం లేదన్నారు. ఈ సందర్భంగా విలేకర్లు అడిగిన ప్రశ్నలకు బదులిస్తూ బీఆర్‌ఎస్‌ను ఒడిశాలో బలోపేతం చేస్తామని తెలిపారు. రానున్న ఎన్నికలలో 147 విధానసభ, 21 పార్లమెంట్‌ స్థానాలకు పోటీ చేస్తుందని వెల్లడించారు. అవిభక్త కొరాపుట్‌ జిల్లాల్లో జయపురంలో రాజకీయ చైతన్యం ఎక్కువని, ఇక్కడి నుంచే 9సార్లు ఎంపీగా విజయం సాధించానని గుర్తు చేస్తుకున్నారు.

దేవుళ్ల దర్శనానికి..

మల్కన్‌గిరి: జిల్లాలో జరుగుతున్న బోడా జాతరకు మాజీ ముఖ్యమంత్రి గిరిధర్‌ గమాంగో హాజరయ్యారు. ఈ సందర్భంగా కన్యమారి వద్ద వనదేవతామూర్తులను దర్శించుకున్నారు. మాండీయబట్టకు తరలిస్తున్న సమయంలో దేవుళ్ల సింహాసనాన్ని మోశారు. గిరిజన సంప్రదాయ వాయిద్యం డప్పు వాయించి, భక్తులను ఉత్సాహ పరిచారు.

రూ.80 లక్షల దోపిడీ సామగ్రి స్వాధీనం






పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాల పరికరాలు, ఇన్‌సెట్లో నిందితుడు

బరంపురం: జిల్లా పోలీసు పరిధి గొళంతరాలో రూ.80 లక్షల విలువైన దోపిడీ సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి గ్యారేజ్‌ యజమానిని ఆదివారం అరెస్ట్‌ చేశారు. దీనిపై ఎస్పీ సరవణ్‌ వివేక్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని పెద్ద బజార్‌ పోలీసు స్టేషన్‌ పరిధి శక్తినగర్‌కు చెందిన గ్యారేజ్‌ యజమాని అడ్డు నాయక్‌ కొద్ది రోజులుగా అక్రమ మార్గాల్లో వాహనాల ఇంజిన్లు, ఇనుప సామాగ్రి కొనుగోలు చేస్తున్నారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తు చేయగా విస్తుపోయే వాస్తవాలు వెలుగు చూశాయి. బరంపురం నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో వాహనాలు, విడిభాగాలు అపహరణకు గురవుతున్నాయి. వీటిని అడ్డు నాయక్‌ తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకొని, రూ.80 లక్షల సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

10నుంచి మెట్రిక్‌ పరీక్షలు

- ప్రశ్నపత్రాలు నోడల్‌ కేంద్రాలకు తరలింపు
- హాజరుకానున్న 5.41 లక్షల మంది అభ్యర్థులు



భువనేశ్వర్‌: ఈనెల 10నుంచి మెట్రిక్యులేషన్‌ ద్వితీయ సమ్మేటివ్‌ అసెస్‌మెంట్‌(ఎస్‌ఏ- 2) పకడ్బందీగా నిర్వహించేందుకు రాష్ట్రప్రభుత్వం దృష్టి సారించింది. హైస్కూల్‌, స్టేట్‌ ఓపెన్‌ స్కూల్‌, మధ్యమ విద్యార్థులకు ఈనెల 20వరకు నిర్వహించే ఎస్‌ఏ-2 పరీక్షలకు 5,41,247మంది విద్యార్థులు హాజరు కానున్నారు. వీరికోసం రాష్ట్రవ్యాప్తంగా 3,218 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షకు అవసరమైన ప్రశ్నపత్రాలు, ఇతర అనుబంధ కాగిత పత్రాల తరలింపు ప్రక్రియ ప్రారంభమైంది. దీనికి సంబంధించిన వివరాలను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్‌ జెనా అధ్యక్షతన జరిగిన వర్చువల్‌ సమావేశంలో రాష్ట్ర మాధ్యమిక విద్యా బోర్డు అధికారులు ఈ వివరాలు తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 316 నోడల్‌ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 22 పోలీస్‌ స్టేషన్లను నోడల్‌ కేంద్రాలుగా ప్రకటించారు. మొత్తం పాఠశాల స్థాయిలో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఈ సర్దుబాటు చేశారు. కంధమాల్‌లో 7, కొరాపుట్‌లో 5, మల్కన్‌గిరిలో 10 కారణాలను నోడల్‌ కేంద్రాలుగా ప్రకటించారు. పరీక్షలు ముగియడంతో 56కేంద్రాల్లో జవాబు పత్రాల మూల్యాంకనం చేపడతారు.

కఠిన చర్యలకు ఆదేశం..

పూర్తి క్రమ పద్ధతిలో శాంతియుత నిర్వహణ పట్ల ఆద్యంతాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీఎస్‌ ప్రదీప్‌ జెనా ఉద్బోటించారు. అన్ని పరీక్షా కేంద్రాలకు అవసరమైన ఇన్విజిలేటర్లు, ఫ్లయింగ్‌ స్క్వాడ్‌లను నియమించి రాత్రింబవళ్లు గట్టి భద్రత కల్పించే దిశలో చర్యలు చేపట్టాలని సూచించారు. స్ట్రాంగ్‌ రూమ్‌లో ప్రశ్నోత్తరాల పత్రాలు, పరీక్షా కేంద్రంలో సెక్యూరిటీ సిబ్బందిని నియమించడం, విద్యుత్‌, తాగునీరు సదుపాయం కల్పించాలని ఆదేశించారు. అక్రమాలకు పాల్పడిన వారి వ్యతిరేకంగా కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగానికి ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి అన్ని జిల్లాల మేజిస్ట్రేట్లు, సెక్యూరిటీ సూపరింటెండెంట్లు, జిల్లా విద్యాశాఖాధికారులు హాజరయ్యారు. అభివృద్ధి కమిషనర్‌ అనూ గర్గ్‌, పాఠశాలలు-సామూహిక విద్యావిభాగం కార్యదర్శి అశ్వతి ఎస్‌.మాధ్యమిక విద్యా బోర్డు అధ్యక్షుడు రమాశిష్‌ హజ్రా, వైస్‌ ప్రెసిడెంట్‌ డాక్టర్‌ నిహార్‌ రంజన్‌ మహంతి, డైరెక్టర్‌ సుశాంత్‌ దాస్‌, అదనపు కార్యదర్శి అశ్విని మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పర్లాకిమిడిలో భాగవత ప్రవచనాలు



రాధాగోవింద మఠంలో ప్రసంగిస్తున్న స్వామి ముకుందానంద

పర్లాకిమిడి: జగద్గురు శ్రీకృపాల్‌జీ మహారాజ్ విశిష్ట ప్రచారక్ స్వామి ముకుందానంద స్థానిక మహారాజా బాలుర ఉన్నత పాఠశాలలో భాగవత ప్రవచనాలు చేశారు. శనివారం రాత్రి పర్లాకిమిడిలోని రాధాగోవింద మఠంలో మాట్లాడుతూ విద్య, ఆరోగ్య సూత్రాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని శిష్య బృందానికి సూచించారు. అనంతరం ఆయన గుణుపురం బయలుదేరి వెళ్లారు.

ప్రకృతితో 'సాగు'దాం



నవధాన్యాల సాగుపై వెదురువాడ రైతులకు అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఆనందరావు

బొండపల్లి: ప్రధానపంట సాగుకు ముందు నవధాన్యాలు సాగుచేయడం వల్ల భూసారం పెరుగుతుందని, పంటకు కావాల్సిన పోషకాలు సమృద్ధిగా లభిస్తాయని ప్రకృతివ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎం.ఆనందరావు తెలిపారు. బొండపల్లి మండలం కొవ్వాడపేట, వెదురువాడ గ్రామాల్లో ఆదివారం నవధాన్యాల సాగువల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం గజపతినగరం సబ్‌డివిజన్ మాస్టర్ ట్రైనర్ బి.సత్యనారాయణ, ప్రకృతి వ్యవసాయం రీసెర్చ్ సహాయకురాలు నీలిమ, బి.రాజేరు సచివాలయం వీఏఏ నాగమణి, మెపాడ రామ్మూర్తి పాల్గొన్నారు.

వేణుగోపాలునికి తులాభార సేవ



జామి: అన్నంరాజుపేట పంచాయతీ పుష్పగిరిలోని పురాతన వేణుగోపాల స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల నేపథ్యంలో వేదపండితుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి స్వామి వారికి తులాభార సేవ నిర్వహించారు. ఆదివారం ఉదయం హోమాలు, ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి తులాభారసేవ, పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఫ్లూ వైరస్‌తో జాగ్రత్త!

- సర్వజన ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ సంతోష్



విజయనగరం ఫోర్ట్: ఢిల్లీలో హెచ్ 3, ఎన్ 2 ఫ్లూ వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉందని, జిల్లాలో ప్రస్తుతానికి ఫ్లూ వైరస్ కేసులు నమోదుకానప్పటికీ అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్, పలమనాలజిస్టు డాక్టర్ బొత్స సంతోష్ ఆదివారం ఓ ప్రకటనలో సూచించారు. హెచ్ 3, ఎన్ 2 సోకితే సాధారణ జలుబు, దగ్గు, జ్వరం, నీరసం ఉంటుందన్నారు. వ్యాధి సోకిన వ్యక్తి దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు, అతనితో చేతులు కలిపినప్పుడు ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందుతుందన్నారు. లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుడిని సంప్రదించాలని పేర్కొన్నారు.

టీబీ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ప్రసాద్

విజయనగరం ఫోర్ట్: టీబీ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ప్రసాద్ ఎన్నికయ్యారు. విజయవాడలో ఆదివారం జరిగిన రాష్ట్ర టీబీ అసోసియేషన్ వార్షిక సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు ప్రసాద్ తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులుగా గవర్నర్, ఉపాధ్యక్షులుగా ముఖ్యమంత్రి వ్యవహరిస్తారన్నారు. చైర్మన్‌గా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, వైస్ చైర్మన్‌గా విజయవాడకు చెందిన డాక్టర్ రామకృష్ణ, ఆరోగ్యవరం నుంచి డాక్టర్ వెస్లీ, రాష్ట్ర కార్యదర్శిగా డాక్టర్ జయకర్‌బాబు ఎన్నికయ్యారు.

కుక్కల దాడిలో జింక పిల్ల మృతి

సీతానగరం: మండలంలోని జోగింపేట బాలయోగి గురుకుల విద్యాలయంలో జింకపిల్లపై కుక్కలు దాడి చేసి హతమార్చాయి. ఆదివారం ఉదయం రేపటివలస కొండనుంచి జింకపిల్ల జోగింపేట బాలయోగి గురుకులం ప్రాంగణంలోకి గోడ గెంతి వచ్చింది. అక్కడే ఉన్న కుక్కలు ఆ జింకపిల్లపై దాడి చేశాయి. దాడిలో గాయాలపాలైన జింకపిల్లను సెక్యూరిటీ సిబ్బంది పోలీసులకు అప్పగించారు. దీంతో పోలీసులు పార్వతీపురం అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా అటవీశాఖ అధికారి మనోజ్ వచ్చి జింకపిల్లను పరిశీలించి మృతి చెందినట్లు గుర్తించారు. అనంతరం జింక కళేబరాన్ని గురుకుల విద్యాలయానికి సమీపంలో పూడ్చివేశారు.

వరపుత్రునికి నివాళులు



బరంపురం: బిజూ పార్కులో వేడుకలు నిర్వహిస్తున్న బీజేడీ నాయకులు, కార్యకర్తలు



బరంపురం: మా బుడి శాంతమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, మేయర్



మానసకుమార్ సాహు ఆవిష్కరించిన బిజూ సైకత శిల్పం



బిజూ పట్నాయక్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్, పక్కన స్పీకర్, మంత్రులు

- ఘనంగా బిజూ పట్నాయక్ జయంతి కార్యక్రమాలు
- సేవా కార్యక్రమాలు చేపట్టిన బీజేడీ నాయకులు, కార్యకర్తలు

భువనేశ్వర్: దివంగత ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్ జయంతి పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా అధికారులు, బీజేడీ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టడంతో ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర శాసనసభ ఆవరణలో ఉన్న బిజూ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నివాళులర్పించారు. కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ విక్రమకేశరి అరూఖ్, మంత్రులు టుకుని సాహు, అశోక్ చంద్ర పండా, ఎమ్మెల్యేలు అమర ప్రసాద్ శత్పతి, నారాయణ జెనా పాల్గొన్నారు.

– బరంపురం: పేదల పెన్నిధి, ఒడిశా వరపుత్రుడు బిజూ బాబు రాష్ట్ర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటారని బరంపురం ఎంపీ చంద్రశేఖర్ సాహు కొనియాడారు. బీజేడీ నాయకులతో కలిసి గ్రామదేవత మాబుడి శాంతమ్మ ఆలయానికి చేరుకొని, ప్రత్యేక పూజలు చేశారు. దేసి బెహరా వీధిలోని బిజూ పట్నాయక్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం సిటీ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బిస్కెట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే విక్రమ్‌కుమార్ పండా, మేయర్ సంఘమిత్ర దొళాయి, బీజేడీ నాయకులు, బీఎంసీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

జయపురం: ఉత్కళ వరపుత్రుడు బిజూ పట్నాయక్ ఆశయాలను నేరవేర్చే దిశగా సీఎం నవీన్ పట్నాయక్ రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ మాజీ చైర్‌పర్సన్ ఇందిరా నందో తెలిపారు. జయపురం బిజూ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేడీ జిల్లా అధ్యక్షుడు, కేసీసీబీ బ్యాంక్ చైర్మన్ ఈశ్వరచంద్ర పాణిగ్రహితో కలిసి బిజూ బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. మాజీమంత్రి రబినారాయణ నందో, నాయకులు అనూప్‌కుమార్ పాత్రొ, బాలారాయ్, కౌన్సిలర్ విష్ణువర్ధనరెడ్డి, బి.బాలంకిరావు, సమితి సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రాయగడ: రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు, బీజేడీ సీనియర్ నాయకుడు వై.వేంకటేశ్వరరావు(కొండబాబు) ఆధ్వర్యంలో బీజేడీ నాయకులు, కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కొత్త బస్టాండ్ వద్ద ఉన్న బిజూ బాబు విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మకరంద ముదులి, మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్, సమితి అధ్యక్షురాలు టున్ని హుయిక, మాజీమంత్రి లాల్‌బిహారి హిమిరిక, బీజేడీ రాష్ట్రశాఖ ఉపాధ్యక్షుడు జగదీష్ పాత్రొ, కాసీపూర్ సమితి అధ్యక్షుడు కొంతొ మాఝి, సుజాత పాలో తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలోని గుణుపూర్‌లో జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సుధీర్ దాస్, ఎమ్మెల్యే రఘునాథ్ గమాంగో పాత బస్టాండ్‌లోని బిజూ పట్నాయక్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

– మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో బిజూ పట్నాయక్ జయంతి కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉన్న బిజూ పట్నాయక్ విగ్రహనికి అదనపు కలెక్టర్ త్రినాద్ మాఝి, బీజేడీ నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

పర్లాకిమిడి: మాజీ ముఖ్యమంత్రి బిజూ పట్నాయక్ జయంతిని పర్లాకిమిడిలో బీజేడీ జిల్లా అధ్యక్షుడు జగబంధు దాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నిర్మలా శెఠి, నాయకులు బసంత్ దాస్, తిరుపతి పాణిగ్రాహి, యువరాణి కల్యాణీదేవి గజపతి, జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, పట్టణ అధ్యక్షుడు సుధీర్‌రంజన్ మహాపాత్రొ, ఎస్.గజపతిరావు, రూపేష్ పాణిగ్రాహి, జమీదార్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా పర్లాకిమిడికి చెందిన బర్నాల జనార్దనరావు(చైతన్య సమితి కార్యదర్శి), జి.నానాజీ సహా ఏడుగురు బీజేడీలో చేరారు.

కొరాపుట్: బిజూ పట్నాయక్ జయంతి సందర్భంగా నబరంగ్‌పూర్ జిల్లా చందాహండిలో ఎంపీ రమేష్ చంద్ర మాఝి, జొరిగాం ఎమ్మెల్యే ప్రకాష్‌చంద్ర మాఝి ఆధ్వర్యంలో బీజేడీ నాయకులు భారీ ర్యాలీ చేపట్టారు. ఉమ్మర్‌కోట్‌లో రాష్ట్ర లిఫ్ట్ ఇరిగేషన్ సలహాదారుడు ప్రమోద్ పాఢి, మాజీ ఎమ్మెల్యే సుభాష్ గొండో, పపదాహండిలో ఎంపీ, ఎమ్మెల్యే, జెడ్పీ అధ్యక్షుడు మోతీరాం నాయక్, నవరంగ్‌పూర్‌లో ఎమ్మెల్యే సదాశివ ప్రధాన్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్‌లో ఎమ్మెల్యే ప్రభుజానీ, మాజీ ఎంపీ జిన్ను హికాక, పొట్టంగిలో ఎమ్మెల్యే పీతం పాఢి బీజూ విగ్రహానికి నివాళులర్పించారు.



జయపురం: సమితి కార్యాలయంలో నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



కొరాపుట్: పపదాహండిలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీ రమేష్, ఎమ్మెల్యే మనోహర్



రాయగడ: రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న కొండబాబు



జయపురం: బిజూ పట్నాయక్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఇందిరా నందో, ఈశ్వర పాణిగ్రహి



పర్లాకిమిడి: సభలో మాట్లాడుతున్న తిరుపతి పాణిగ్రహి



పర్లాకిమిడి: హాజరైన బీజేడీ నాయకులు, కార్యకర్తలు



రాయగడ: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎంపీ నెక్కంటి



మల్కన్‌గిరి: కలెక్టర్ కార్యాలయం వద్ద నివాళులర్పిస్తున్న బీజేడీ నాయకులు



కొరాపుట్: లక్ష్మీపూర్‌లో ఎమ్మెల్యే ప్రభుజానీ, మాజీ ఎంపీ జిన్ను హికాక

కొనసాగుతున్న బోడాజాతర



అమ్మవారి పూజా మండపం వద్ద ఎంపీ రమేష్ మాఝి

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో ప్రారంభమైన బోడా జాతర ఆదివారం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. ఈ సందర్భంగా వనదేవతా మూర్తులను నవరంగ్‌పూర్ ఎంపీ రమేష్‌మాఝి దర్శించుకున్నారు. చిత్రకొండ ఎమ్మెల్యే పూర్ణచంద్ర బక్క, బీజేడీ నాయకులు పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేవారు. అలాగే అమ్మవారి దర్శనానికి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. పూజా మండపం వద్ద లాఠీలు(ఘటాలు) చేతపట్టి, దీపాలు వెలిగించారు. పూజారులు నెమలి పింఛాలతో నాట్యం చేసి, అలరించారు. అలాగే మల్కన్‌గిరి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కవిత మహంతో దర్శనానికి వచ్చిన భక్తులకు తన ఇంటి వద్ద మజ్జిగ సరఫరా చేశారు. సాయి సేవాసమితి సభ్యులు హల్వా పంపిణీ చేశారు.

కారు బోల్తా పడి వ్యక్తి మృతి



శేషగిరిరావు మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య

పాలకొండ: మండలంలోని అట్టలి జంక్షన్ వద్ద ఆదివారం సాయంత్రం కారు బోల్తా పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ప్రమాదానికి సంబంధించి ఎస్సై శివప్రసాద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా మందస మండలం పొత్తంగి గ్రామానికి చెందిన శేషగిరిరావు కటుంబసభ్యులతో కలిసి పార్వతీపురం మన్యం జిల్లాలో బంధువుల ఇంట్లో బారసాల ఫంక్షన్‌కు కారులో వెళ్లారు. భోజనాల అనంతరం తిరుగుప్రయాణంలో పాలకొండ మండలం అట్టలి గ్రామం వద్ద ఉన్న మలుపును డ్రైవర్ గమనించక పోవడంతో రోడ్డు పక్కనే ఉన్న కానాను కారు బలంగా ఢీకొట్టి బోల్తా పడింది. దీంతో డ్రైవర్ పక్క సీటులో కూర్చున్న శేషగిరిరావు కారు అద్దాన్ని గుద్దుకోవడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. డ్రైవర్ రుద్రయ్య తో పాటు కారులో ఉన్న మిగతావారికి స్వల్ప గాయాలు కావడంతో స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దోమలమందు తాగి ఆత్మహత్యా యత్నం

పార్వతీపురం: జియ్యమ్మవలస మండలం గొర్లి గ్రామానికి చెందిన మెల్లక తవిటమ్మ మనస్తాపం చెదిన ఇంట్లో ఉన్న దోమల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేసింది. ఆదివారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. కొద్ది నెలలుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న తవిటమ్మ చినమేరంగి పీహెచ్‌సీలో వైద్యం పొందుతోంది. అయితే ఎప్పటికీ వ్యాధి నయం కాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో ఉన్న దోమల మందు తాగేసింది. ఈ విషయాన్ని ఆమె భర్త చక్రపాణి గమనించి 108 వాహనంద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందజేస్తున్నారు. ఈ మేరకు ఆస్పత్రి అవుట్ పోస్ట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

9 నుంచి ఉద్యోగుల నిరసన

- ఉద్యమ కార్యాచరణ షెడ్యూల్ విడుదల



మాట్లాడుతున్న మున్సిపల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణమోహన్

విజయనగరం అర్బన్: ఉద్యోగుల సమస్యల సాధన కోసం ఈ నెల 9వ తేదీ నుంచి నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఏపీ జేఏసీ అమరావతి జిల్లా కమిటీ ప్రకటించింది. ఉద్యమాన్ని విజయవంతం చేయాలంటూ విజయనగరం రెవెన్యూ కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో తీర్మానించారు. 9 నుంచి 20 తేదీ వరకు నల్ల బాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు, భోజన విరామ సమయాలలో నిరసనలు, జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నాలు చేపడతారు. 21న వచ్చే నెల 5వ తేదీ వరకు వివిధ స్థాయిలో వినతుల అందజేసే కార్యక్రమాలు ఉంటాయని షెడ్యూల్‌లో ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణమోహన్, వీఆర్వో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చంటి, ఏపీ జేఏసీ జిల్లా కమిటీ జిల్లా అధ్యక్షుడు కె.రమణరాజు, సెక్రటరీ విజయ్‌కుమార్, రాష్ట్ర సలహాదారుడు డీజీ ప్రసాద్, రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు తాడ్డి గోవింద్, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ సెక్రటరీ పి.భానుమూర్తి, వివిధ శాఖల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా: ముగ్గురికి గాయాలు

సంతకవిటి: మండలంలోని గుళ్లసీతారాంపురం-బొద్దూరు గ్రామాల మధ్య ఆదివారం ఆటో బోల్తాపడడంతో ముగ్గురు వ్యక్తులు గాయాలపాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. సంతకవిటి నుంచి రాజాం వెళ్తున్న ఆటో, ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం పరస్పరం ఢీకొనడంతో ప్రమాదం సంభవించినట్లు స్థానికులు చెప్పారు. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ గొర్లె షన్ముఖరావుకు గాయాలు కాగా, ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న సంతకవిటి మండలం బూరాడపేట గ్రామానికి చెందిన ఎం.ప్రసాద్‌తో పాటు బైక్ వెనుక ఉన్న వంగర మండలం శివ్వాం గ్రామానికి చెందిన బి.లక్ష్మణరావులకు కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులను జి.సిగడాం మండలంలోని సామాజిక ఆస్పత్రికి 108 వాహనం ద్వారా తరలించగా చికిత్స పొందుతున్నారు.

రైల్వేస్టేషన్లకు ఆధునిక సొబగులు

- విశాఖ డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ శత్పథి



విజయనగరం రైల్వేస్టేషన్ బ్రిడ్జిపై నుంచి ట్రాక్ పనులు పరిశీలిస్తున్న డీఆర్ఎమ్ శత్పథి

విజయనగరం టౌన్: విశాఖ డివిజన్ పరిధిలోని 16 రైల్వేస్టేషన్లను ఆధునీకరిస్తున్నట్టు డీఆర్ఎం అనూప్ కుమార్ శత్పథి తెలిపారు. విజయనగరం రైల్వేస్టేషన్‌ను ఆయన ఆదివారం సందర్శించారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా రైల్వేస్టేషన్‌లో ఉన్న ప్లాట్‌ఫారాలు, ఇంటర్‌నెట్ కనెక్షన్, ప్రయాణికులకు మెరుగైన వసతి సదుపాయాలు కల్పించేందుకు రంగం సిద్ధం చేస్తున్నామన్నారు. పర్లాకిమిడి నుంచి విశాఖపట్టణం వరకు ఉన్న వివిధ స్టేషన్లను రోజువారీగా పరిశీలిస్తున్నామని చెప్పారు. రైల్వేస్టేషన్లో చేపట్టబోయే ఆధునీకరణ పనుల నివేదికను కేంద్రానికి పంపించామని వివరించారు. ఇప్పటికే విశాఖ రైల్వేస్టేషన్‌ను ఆధునీకరించామని చెప్పారు. ఆయన వెంట కమర్షియల్ ఇన్స్‌పెక్టర్ ప్రసాద్, స్టేషన్ మేనేజర్ మురళీకృష్ణ, కాశీబాబు ఉన్నారు.

బతుకు బండి



ఎండైనా.. వానైనా బతుకుబండి ముందుకు సాగితేనే నాలుగుమెతుకులు నోట్లోకి వెళ్లేది. కుటుంబ బండిని సజావుగా నడపాలంటే ఈ బరువు బండిని గమ్యస్థానానికి చేర్చాల్సిందే. విజయనగరం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో ఆదివారం 'సాక్షి' కెమెరాకు చిక్కిన ఈ చిత్రం శ్రమైకజీవన సౌందర్యాన్ని ప్రతిబింబిస్తోంది.

– సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం

పూల సోయగం



నెల్లిమర్ల పట్టణ పరిధిలోని ఊట గెడ్డ సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్ ప్రాంగణంలో కాగితం పూల చెట్టు విరగబూసింది. ఆకులు కనిపించనంతగా పూలతో చూపరులను ఆకర్షిస్తోంది. నెల్లిమర్ల–విజయనగరం రోడ్డులో వెళ్లే ప్రయాణికులకు ఆహ్లాదాన్ని పంచుతోంది.

– నెల్లిమర్ల

న్యూస్‌రీల్

సరిహద్దులో వాహన తనిఖీలు



పాతపట్నం: ఒడిశా నుంచి వచ్చిన వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ కామేశ్వరరావు

పాతపట్నం: ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతం పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆదివారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎస్‌ఐ ఎన్.కామేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఒడిశా నుంచి వస్తున్న వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. తనిఖీల్లో ఏఎస్‌ఐ సింహచలం, కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా మారథాన్ సైకిల్ ర్యాలీ



సైక్లింగ్ మారథాన్ ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ మీనాక్షి

అరసవల్లి: సైక్లింగ్‌తో ఆరోగ్యం ముడిపడి ఉందని, నిత్యం సైకిల్ తొక్కితే గుండె మరింత పదిలంగా ఉంటుందని జిల్లా వైద్యారోగ్య శాఖ మంత్రి డాక్టర్ బి.మీనాక్షి అన్నారు. ఆదివారం స్థానిక ఆర్ట్స్ కళాశాల నుంచి ఏడురోడ్ల కూడలి వరకు సైకిల్ మారథాన్ ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువజన సర్వీసులు, నెహ్రూ యువకేంద్రం, క్రీడాభివృద్ధి శాఖ, రెడ్‌క్రాస్ తదితర సంస్థల ప్రతినిధులంతా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సైకిల్ తొక్కితే శరీర రక్త నాళాలు, ఊపిరితిత్తులు కూడా బాగా పనిచేస్తాయని చెప్పారు. కార్యక్రమంలో నెహ్రూ యువకేంద్ర కోఆర్డినేటర్ ఉజ్వల్, సెట్‌శ్రీ సీఈఓ బీవీ ప్రసాదరావు, టూరిజం అధికారి నారాయణరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహన రావు తదితరులు పాల్గొన్నారు.

సదుపాయాల కల్పనపై పరిశీలన



నౌపడ ఆర్ఎస్ రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్ఎం అనూప్ కుమార్ శతపతి

టెక్కలి రూరల్: మండలంలోని నౌపడ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పన కోసం రైల్వే వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం అనూప్ కుమార్ శతపతి ఆదివారం సాయంత్రం స్టేషన్‌ను పరిశీలించారు. స్టేషన్‌ను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఇక్కడ సూపర్‌ఫాస్ట్ రైళ్లు ఆగేలా ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటా నన్నా రు. రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ టెక్కలిలో ఆపాలని స్థానికులు కోరుతున్నారని, దాన్ని కూడా పరిశీలిస్తామని తెలిపారు. అనంతరం ప్రత్యేక రైల్‌లో నౌపడ ఆర్ఎస్ నుంచి గుణ్‌పూర్ వరకు పర్యటించి మార్గం మధ్యలో ఉన్న పాతపట్నం, పెద్దసాన, తెంబూరు స్టేషన్లను పరిశీలించారు.

ఉత్సాహంగా జిల్లా ఫెన్సింగ్ ఎంపిక పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి సీనియర్స్ ఫెన్సింగ్ ఎంపిక పోటీలు ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి. జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని టౌన్‌హాల్ వేదికగా ఆదివారం ఈ ఎంపికలు జరిగాయి. ఈ ఎంపికలను సీనియర్ న్యాయవాది జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ముఖ్య సలహాదారు నౌపడ విజయ్‌కుమార్, వ్యాపారవేత్త బలభద్రుని రాజా ప్రారంభించారు. రాష్ట్రంలో స్పోర్ట్స్ కోటాను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పక్కాగా అమలు చేస్తున్నారని, క్రీడలకు, క్రీడాకారులకు ఉజ్వలమైన భవిష్యత్ లభించబోతోందని వారు చెప్పారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులను ఈనెల 11, 12 తేదీల్లో కాకినాడ వేదికగా జరిగే రాష్ట్రస్థాయి సీనియర్స్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు పంపించనున్నట్టు జిల్లా ఫెన్సింగ్ సంఘ ప్రతినిధులు వైశ్యరాజు మోహన్, తదితరులు తెలిపారు. ఎంపికైన పురుషులు, మహిళల క్రీడాకారుల జాబితాను వెల్లడించారు.

బైక్ అదుపు తప్పి వృద్ధుడు మృతి

రణస్థలం: మండలంలోని పైడిపేట జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో అరసవల్లికి చెందిన కల్లేపల్లి కోటేశ్వరరావు(64) మృతి చెందాడు. జె.ఆర్.పురం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో విశాఖపట్నం వైపు నుంచి శ్రీకాకుళం వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్న కోటేశ్వరరావు కోష్ట పంచాయతీ పైడిపేట వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో కోటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈయన స్వగ్రామం లావేరు మండలం తాళ్లవలస. కొన్నేళ్లుగా బ్యాంకు ఉద్యోగం రీత్యా అరసవల్లిలో ఉంటున్నారు. మృతునికి భార్య రామలక్ష్మి, వివాహమైన కుమారుడు, కుమార్తె ఉన్నారు. జె.ఆర్.పురం ఎస్సై జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని శవ పంచనామా నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

ఊరికి ఊరట

- కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అండగా ప్రభుత్వం
- మందుల నుంచి పింఛను వరకు అన్నింటా చేదోడు
- ఊపిరి పీల్చుకుంటున్న ఉద్దానం



హరిపురం సీహెచ్‌సీలో కొత్తగా ఏర్పాటు చేసిన డయాలసిస్ బెడ్లు (ఫైల్)

కంచిలి, సోంపేట:

ఏడుపు అలవాటై, చావు కబురు సాధారణమైపోయిన స్థితిలో ఉద్దానంలోని ఊరికి ప్రభుత్వం ఊరట కలిగిస్తోంది. ఇక్కడ దశాబ్దానికిపైగా తిష్ట వేసుకుని మనుషులను తినేస్తోన్న కిడ్నీ వ్యాధిపై పోరాటంలో.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చూపిస్తున్న చిత్తశుద్ధి బాధితులకు సాంత్వన కలిగిస్తోంది. డయాలసిస్ కేంద్రాల్లో ఉన్న బెడ్లను ఎప్పటికప్పుడు పెంచుతూ, డయాలసిస్ రోగులకు జాప్యం లేకుండా వైద్యం అందించేందుకు చర్యలు చేపడుతున్నారు. గతంలో విశాఖపట్నం వంటి దూరప్రాంతాలకు వెళ్లి వేలకు వేలు ఖర్చు చేసి డయాలసిస్ చేయించుకునేవారు. ఇప్పుడు ఆ దుస్థితి లేదు. అవసరమైన డయాలసిస్ కేంద్రాలు స్థానికంగానే ఏర్పాటు చేయడంతో పాటు బెడ్లు కూడా పెంచుతున్నారు. కొద్దిరోజుల్లో ఇచ్ఛాపురం ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో కూడా డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నా రు. ఇక రూ.5వేలు, రూ.10వేల పింఛన్లు కిడ్నీ బాధితులకు ఇస్తున్న ధైర్యం మాటల్లో చెప్పలేనిది.



మంత్రి హామీపై హర్షం

ఉద్దానంలోని కిడ్నీ వ్యాధి తీవ్రతను తెలుసుకునేందుకు స్వయంగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని ఇటీవలే ఇక్కడ పర్యటించారు. ఇక్కడ కిడ్నీ వ్యాధిగ్రస్తులతో ముఖాముఖి మాట్లాడారు. ఇక్కడి పరిస్థితి తీవ్రతపై ఆమెతోపాటు, వైద్య ఆరో గ్య శాఖ ఉన్నతాధికారులు ఒక అంచనాకు వచ్చారు. సోంపేట, కవిటి డయాలసిస్ కేంద్రాల్లో ఐదేసి బెడ్లు పెంచుతామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఆయా గ్రామ సచివాలయం పరిధిలో గల వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్ లోనే కిడ్నీ పరీక్షలు చేయించడానికి చర్యలు చేపడతామన్నారు. ఇప్పటి వరకు ఉచితంగా ఇస్తున్న మందులతోపాటు, మరికొన్ని అవసరమైన మందు లు, రక్తం వృద్ధి చెందే ఇంజెక్షన్ల సరఫరా పెంచుతామని హామీ ఇచ్చారు. పలాసలో నిర్మితమవుతున్న 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌ను త్వరలో పూర్తి చేసి, జాతికి అంకితం చేస్తామని, ఇందుకోసం యుద్ధప్రాతిపదికన పనులు జరుగుతున్నాయని తెలిపారు.

సద్వినియోగం కావాలి..

కిడ్నీ వ్యాధిగ్రస్తుల కోసం ప్రభుత్వం 36 రకాల మందులను ఉచితంగా సరఫరా చేస్తున్నారు. కానీ కొందరు రోగులు ప్రైవేటు వైద్యుల మాటలు నమ్మి బయట మెడికల్ షాపుల్లో లభ్యమయ్యే మందుల్నే కొనుగోలు చేసి, డబ్బును దుబారా చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే ఉచిత మందుల్ని వినియోగించుకోవాలని ప్రభుత్వం నియమించిన నెఫ్రాలజిస్టులు ప్రతి 15 రోజులకు ఓ సారి వచ్చి చెప్పినప్పటికీ కొందరు రోగులు పెడచెవిన పెడుతున్నారు. ప్రభుత్వం ఇచ్చే మందులు సరైనవేననే విషయంపైన వారికి మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. డయాలసిస్ కేంద్రాల నిర్వహణ బాధ్యతను 'నెఫ్రోప్లస్' అనే ప్రైవేటు సంస్థకు ప్రభుత్వం అప్పగించింది. రోజు రోజుకు డయాలసిస్ రోగుల సంఖ్య పెరుగుతోందని, సిబ్బందిని కూడా పెంచాలని వారు కోరుతున్నారు. పనికి తగ్గ వేతనం అందించాలనే డిమాండ్ కూడా ఉంది.



డయాలసిస్



డయాలసిస్

ఉద్యోగం మానేశా..



నా తల్లికి కిడ్నీ వ్యాధి సోకడం వల్ల ఆరేళ్లుగా తిరుపతిలో చేస్తున్న ఉద్యోగం మానేసి వచ్చేశాను. వారానికి రెండుసార్లు డయాలసిస్ కేంద్రానికి తీసుకొచ్చి, రక్తం మార్పిడి చేయించి, ఇంటికి తీసుకెళ్తున్నాను. అయితే కిడ్నీ డయాలసిస్ రోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.10వేలు పింఛన్‌తో ఉపశమనం కలుగుతోంది.

– జి. పాపమ్మ, డయాలసిస్ రోగి, జి. రుక్కు, వ్యాధిగ్రస్తురాలు కుమారుడు, లండారిపుట్టుగ గ్రామం, కవిటి మండలం

36 రకాల మందులు సరఫరా..



కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అవసరమైన 36 రకాల మందుల్ని ఉచితంగా ప్రభుత్వం అందిస్తోంది. ఈ మందుల్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలి. బయట మందుల్ని కొనుగోలు చేయడం వలన డబ్బు వృధా అవుతుందని రోగులు, వారి కుటుంబీకులు గుర్తించాలి.

– డాక్టర్ పెద్దింటి దుర్యోధన, సూపరింటెండెంట్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రి, సోంపేట

చక్కటి సేవలు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఉద్దాన ప్రాంతాన్ని పీడిస్తున్న కిడ్నీ సమస్యను రూపుమాపేందుకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు ముందడుగు పడింది. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వాలు చేయని పనిని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టింది. ఆ దిశగా అవసరమైన చర్యలు చేపడుతోంది. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఉపశమనం కలిగించేందుకు ఎప్పటికప్పుడు ప్రభుత్వం ద్వారా పర్యవేక్షిస్తూ ముందుకు వెళుతున్నాం.

– పిరియా సాయిరాజ్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త, ఇచ్ఛాపురం

కూర్మనాథుని డోలోత్సవానికి సర్వం సిద్ధం

- నేటి రాత్రి కామదహనోత్సవం
- 7వ తేదీన పడియ



శ్రీకూర్మనాథుడు

గార: ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రం శ్రీకూర్మంలో సోమవారం నుంచి డోలోత్సవం ప్రారంభం కానుంది. తొలి రోజు కామదహనోత్సవం అత్యంత వైభవంగా జరగనుంది. ఏటా ఫల్గుణ మాస త్రయోదశి నాడు మఘ నక్షత్రంలో జరిగే ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తారు. తొలుత స్వామి ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై ఉంచి మేళతాళాలతో తిరువీధి నిర్వహిస్తారు. అనంతరం గ్రామ సమీపంలోని కామదహనం మంటపం వద్ద కామదహన కార్యక్రమాన్ని వేదపండితులు నిర్వహిస్తారు. మరుసటి రోజున భక్తులు సముద్ర స్నానం చేస్తారు. అనంతరం శ్వేతపుష్కరిణిలో పవిత్ర స్నానాలాచరిస్తారు. బుధవారం ఉదయం డోలో మంటపంలో స్వామి ఉత్తరాభిముఖ దర్శనం ఇస్తారు.

భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు

మూడు రోజుల పాటు నిర్వహించే ఈ డోలోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు ఆలయ ఈఓ జి.గురునాథం తెలిపారు.



శ్రీకూర్మనాథాలయం

దళితుల దారిని అడ్డుకోవడం దారుణం



దళితుల ఇంటి ముందు నుంచి టీడీపీ నాయకులు నిర్మించిన ప్రహరీని పరిశీలిస్తున్న జిల్లా దళిత సంఘ నాయకులు

ఇచ్ఛాపురం రూరల్: మశాఖపురం గ్రామంలో శివాలయం రక్షణ గోడ నిర్మాణం పేరుతో దళితుల రాకపోకలను టీడీపీ నాయకులు అడ్డుకోవడం దారుణమని జిల్లా దళిత సంఘం నిజ నిర్ధారణ కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది. తరాల నుంచి దళితులు స్థానిక శివాలయాన్ని ఆనుకొని జీవనం సాగిస్తున్నారు. ఇటీవల ఆలయ ప్రహరీని దళితులు నివాసం ఉంటున్న ఇళ్ల ముంగిట్లో స్థానిక సర్పంచ్ కుమారుడు, టీడీపీ నాయకుడు ఆళి మాధవరావుతో పాటు టీడీపీ నాయకులు నిర్మించడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న జిల్లా దళిత సంఘ నాయకులు కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర నాయకులు మిస్క కృష్ణయ్యతో పాటు జిల్లా దళిత సంఘ నాయకులు ఆదివారం సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. దళితులు నిత్యం వెళ్లే దారిని అడ్డుకోవడం సమంజసం కాదని అన్నారు. బాధితులతో మాట్లాడి వారి వాంగ్మూలంతో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. కేఎన్‌పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి రాకోటి రాంబాబు, సంకభీమ్‌జీకర్, సమతా సైనికదళ్ జిల్లా అధ్యక్షుడు చల్లా రామారావు, ఎస్ఎస్‌డి నియోజకవర్గ సమన్వయకర్త పందిరి లోకేశ్, నియోజకవర్గ అధ్యక్షులు బడియా నాగేశ్వరరావు, కార్యదర్శి జడ్డిడి లింగరాజు, పందిరి కేశవరావు సంఘ నాయకులు పాల్గొన్నారు.

అగ్ని మంటల్లో జీడితోటలు దగ్ధం



మంటల్లో దగ్ధమైన జీడి తోటలు

మందస: మందస పంచాయతీ పరిధిలో జరిగిన అగ్ని ప్రమాదంలో చిన్నబరంపురం గ్రామానికి చెందిన రైతుల జీడితోటలు దగ్ధమయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు అడవుల్లో నిప్పు పెట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని చెబుతున్నారు. బి.ప్రకాశ్, బి.ప్రభాకరరావు, నాగేశ్‌లకు చెందిన సుమారు 5 ఎకరాల జీడితోటలు మంటల్లో కాలిపోయాయి. మంటలు ఆర్పడం ఎవరి తరం కాలేదు. ఈ మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆదిత్యుని సన్నిధిలో భక్తుల రద్దీ



క్యూలైన్లలో భక్తుల రద్దీ



ఆదిత్యుని సన్నిధిలో వైద్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ శేషారెడ్డి తదితరులు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఆదివారం భారీ సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వేకువజామునే చేరుకున్న భక్తులు ఆదిత్యుని తొలిదర్శనాన్ని చేసుకుని అనంతరం శ్రీకూర్మం డోలోత్సవాలకు, వత్సవలస రాజమ్మతల్లి ఆలయ దర్శనాలకు తరలి వెళ్లారు. దీంతో ప్రధాన మార్గం వాహనాలతో నిండిపోయింది. ఆదివారం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేకంగా అలంకరించారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి కాశ్యపశర్మ, సాందీప్‌శర్మ, ఫణీంద్ర శర్మ తదితర బృందం భక్తుల గోత్రనామాలతో అర్చనలు చేయించారు. పలు ఆర్జిత సేవలను రద్దు చేయడంతో భక్తులు దర్శనాలు సకాలంలో పూర్తయ్యాయి. ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో టెంట్లు, మంచినీటి సరఫరా, ఉచిత ప్రసాదాల పంపిణీ సజావుగా జరిగాయి. వైద్యారోగ్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ శేషారెడ్డి కుటుంబసమేతంగా ఆదిత్యున్ని దర్శించుకున్నారు. ఒక్క రోజులో వివిధ దర్శనాల టికెట్ల విక్రయాలతో రూ.4,64,300, విరాళాలు, పూజల టికెట్ల విక్రయాలతో రూ.77,875, ప్రసాదాల విక్రయాలతో రూ.2.30 లక్షల వరకు ఆదాయం లభించినట్లు సూపరింటెండెంట్ తెలిపారు.

ఘనంగా శ్రవణ కీర్తన మహోత్సవం



హిరమండలం కూర్మ గ్రామంలో ప్రవచనాలు చెబుతున్న భక్తివికాస స్వామి



శ్రవణ కీర్తన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

హిరమండలం: కూర్మ వర్ణాశ్రమ గ్రామంలో ఆదివారం ఆధ్యాత్మిక శోభ నెలకొంది. అంతర్జాతీయ కృష్ణ చైతన్య మతం ప్రచారకులు, కృష్ణ కృపామూర్తి పూజ్య భక్తి వికాస స్వామి ముఖ్య అతిథిగా వచ్చారు. గుజరాత్ లోని నంద, మధ్యప్రదేశ్‌లోని భక్తి గ్రామం, పంజాబ్‌లోని భవనికాశ్రమం, తమిళనాడులో పంచమటి, యూరప్‌లోని చెక్ రిపబ్లిక్ లోని నవగోకులం వంటి వర్ణాశ్రమ క్షేత్రాలను, వైదిక గురుకులాలను స్థాపించడంలో ఈయనే క్రియాశీలక పాత్ర పోషించారు. స్వామిని చూసేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చారు. ఈ సందర్భంగా తిరువీధి, భజనలు, కృష్ణ కీర్తనలతో గ్రామం మార్మోగిపోయింది. మధ్యాహ్నం 11 గంటలకు స్వామి ఆధ్యాత్మిక ప్రవచనం ఇచ్చారు. వర్ణాశ్రమాలు, వైదిక గురుకులాల ఏర్పాటు, వాటి విశిష్టత గురించి సమగ్రంగా అవగాహన కల్పించారు. అంతర్జాతీయ కృష్ణ చైతన్య మతం ఆశయాలను వివరించారు. 1957లో బ్రిటన్‌లో జన్మించిన తాను ఇస్కాన్‌లో 1975లో సభ్యత్వం స్వీకరించినట్టు తెలిపారు. పరమ పూజ్య భక్తి వేదాంత స్వామి ప్రభుపాద వద్ద దీక్ష స్వీకరించినట్టు తెలిపారు. దేశ, విదేశాల్లో ఇస్కాన్ ఏర్పాటుకు ఈయన ఎనలేని కృషి చేశారు. ఈ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌ల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. వేలాది మంది భక్తులకు వర్ణాశ్రమంలో అన్న ప్రసాద వితరణ చేశారు.

చనిపోతున్నాను.. క్షమించండి..

- సూసైడ్ నోట్ రాసి ఉరివేసుకున్న యువకుడు



ఆత్మహత్య చేసుకున్న లక్ష్మీ నరసింహ పాత్రో

రణస్థలం: మండల కేంద్రంలోని జె.ఆర్.పురం పంచాయతీలో ఓ యువకుడు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టెక్కలి పంచాయతీలోని పెద్ద బ్రాహ్మణ వీధికి చెందిన లక్ష్మీ నరసింహ పాత్రో(24) ఫిబ్రవరి 11న డాక్టర్ రెడ్డీస్ పరిశ్రమలో క్యూఏగా ఉద్యోగంలో చేరాడు. జె.ఆర్.పురంలోని ప్రైవేటు డిగ్రీ కళాశాల సమీపంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. శనివారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో తాను బీ షిఫ్ట్‌కు వెళుతున్నానని బాధతో కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పాడు. ఏం జరిగిందో తెలుసుకునేందుకు వారు తిరిగి చేసినా ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో తండ్రి రాజా కిషోర్ పాత్రో, తమ్ముడు నీలమణి పాత్రో ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు రణస్థలం వచ్చారు. అద్దె ఇంటికి వెళ్లి ఆరా తీశారు. వెనక గది తలుపు తీసి ఉండటంతో లోపలకు వెళ్లి చూసే సరికి శ్లాబ్‌కు ఉరివేసుకుని వేలాడుతూ విగతజీవిగా కనిపించాడు. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి పరిశీలించగా..యువకుడి వద్ద సూసైడ్ లెటర్ దొరికింది. అందులో ఒడిశా భాషలో ఇంగ్లీష్ అక్షరాలతో వివరాలు ఉన్నాయి. 'అమ్మా నాన్న.. నేను చనిపోతున్నాను. మిమ్మల్ని బాధపెడుతున్నాను. నా మనసులో ఉన్న మాట మీకు చెప్పలేను. చెప్పినా మీరు అంగీకరిస్తారని అనుకోవడం లేదు. అందుకే చనిపోతున్నాను. నన్ను క్షమించండి..' అని రాసి ఉన్నట్లు మృతుడి తమ్ముడు నీలమణి పాత్రో చదివి వినిపించాడు. తండ్రి గజపతిజిల్లా మణిపట్నంలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వర్తిస్తున్నారు. జె.ఆర్.పురం ఎస్సై జి. రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

వైభవంగా మన మహాలక్ష్మి ఆలయ ప్రతిష్టాపనోత్సవం



గూనభద్ర ఆర్ఆర్‌కాలనీలో ముర్రాటలతో మహిళలు

కొత్తూరు: మండలంలోని గూనభద్ర ఆర్ఆర్ కాలనీ(పాడలి)లో వన మహాలక్ష్మి దేవి ఆలయ ప్రతిష్టాపనోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. వనమహాలక్ష్మి సమేత లక్ష్మీనారాయణ స్వాముల విగ్రహమూర్తులకు వంశధార నదీ జలాలతో అభిషేకం చేశారు. మధ్యాహ్నం వేలాది మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. గోవింద మాలధారణ భక్తులతో కాలనీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ నెల తొమ్మిది వరకు ప్రతిష్టాపనోత్సవాలు జరగనున్నాయని, పలు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు.

వెంటాడిన మృత్యువు

- భార్య కళ్లెదుటే భర్త మృతి



భర్త మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య సోనియా (ఇన్‌సెట్లో) శేషగిరిరావు(ఫైల్)

మందస: స్వయంకృషితో ఎదుగుతున్న ఆ యువకుడిని మృత్యువు వెంటాడింది ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆ కుటుంబం అనాథగా మారింది. మందస మండలం పొత్తంగి గ్రామానికి చెందిన బోర శేషగిరిరావు(36) వెల్డర్‌గా పని చేస్తూ.. అప్పుడప్పుడు విదేశాలకు వెళ్లి వస్తుండేవాడు. వెల్డింగ్‌లో నైపుణ్యం సాధించారు. తనకు తెలిసిన విద్యను క్లాసుల రూపంలో విద్యార్థులకు బోధిస్తూ.. వారిని కూడా ప్రయోజకులుగా మారుస్తున్నారు. కాగా, బంధువుల బారసాల ఫంక్షన్‌కు ఆదివారం పార్వతీపురం మన్యం జిల్లాలోని పార్వతీపురానికి ఉదయాన్నే కారులో తల్లి పార్వతి, భార్య సోనియా, కుమారుడు జయవర్ధన్, కుమార్తె జయశ్రీలతో కలిసి బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో పాలకొండ సమీపంలోని అత్తిలి వద్ద వారు ప్రయాణిస్తున్న కారు ఓ కల్వర్టును బలంగా ఢీకొని.. విద్యుత్ స్తంభాలను కూడా ఢీకొంది. ఈ ప్రమాదంలో శేషగిరిరావు అక్కడికక్కడే మృతి చెందగా.. తల్లి పార్వతి చేయి విరిగిపోయింది. భార్య, పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. తన కళ్లదుటే భర్త మరణించడంతో భార్య సోనియా కన్నీరుమున్నీరుగా విలపించింది. కాగా, శేషగిరిరావుకు జర్మనీలో పని చేయడానికి ఓ ప్రముఖ కంపెనీ నుంచి సమాచారం రావడంతో ఆయన బయలుదేరడానికి సిద్ధమవుతున్న తరుణంలో మృత్యువు వెంటాడటాన్ని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. శేషగిరిరావు మృతి పట్ల సర్పంచ్ దల్లి కిరణ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నేత దల్లి జానకిరావురెడ్డి, కదంబాల చలపతిరావు, గెడ్డవలస వెంకటేశ్ సంతాపం తెలిపారు.

వత్సవలసకు పోటెత్తిన భక్తజనం



వత్సవలసలో భక్తుల రద్దీ

గార: వత్సవలసలో కొలువైన రాజమ్మ తల్లి (రాజరాజేశ్వరి) దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఐదో ఆదివారం కావడంతో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భారీగా భక్తులు తరలిరావడంతో రోడ్లు, వీధులు కిక్కిరిసిపోయాయి. శనివారం రాత్రికే భక్తులు గ్రామానికి చేరుకుని బసచేసి ఆదివారం వేకువజామున సముద్రంలో స్నానాలాచరించారు. అనంతరం అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. ఎస్‌ఐ ఎం.మధుసూదనరావు బందోబస్తు పర్యవేక్షించారు. సముద్ర స్నానాలు వద్ద మెరైన్ పోలీసులు గస్తీకాశారు. రాజరాజేశ్వరి అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆదివారం ఉదయం దర్శించుకున్నారు.